క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు






సంబేపల్లె : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా ఆవార్డు అందిస్తున్నట్లు అదివారం విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన జాఫర్‌వలీ, సంబేపల్లె జెడ్పీ పాఠశాల రుక్సానా, గున్నికుంట్ల జెడ్పీ పాఠశాల మౌనిషా, సాయిప్రగతి (కేజీబీవీ) నిఖిత (కేజీబీవీ)లు ఈ అవార్డులకు ఎంపికైనట్లు చెప్పారు.

ఎస్‌జీటీలకు మాన్యువల్ ఇంటర్వ్యూలు నిర్వహించాలి


రామకృష్ణ

పెనగలూరు : ఎస్‌జీటీలకు మాన్యువల్ ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రామకృష్ణ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పి మాట మార్చిందన్నారు. మాన్యువల్ ద్వారా కౌన్సిలింగ్ జరపకుంటే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు తెలిపారు. ఉపాధ్యాయుల ఐక్యతతో మాన్యువల్ కౌన్సిలింగ్‌ను జరిపేలా కృషి చేస్తామన్నారు.

నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి

వీరబల్లి : మండలంలోని గడికోట ప్రాంతానికి చెందిన చమ్మర్తి సుబ్బరామరాజు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి ఆదివారం గడికోట ప్రాంతానికి వెళ్లి సుబ్బరామరాజు స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ, మండల సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణిరాజు, సుబ్బరామరాజు, గంగిరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరురూరల్ : పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం పీలేరు నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం బి.నిర్మల తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రద్దీని బట్టి 5 నుంచి 10 బస్సులు నడుపుతామని తెలిపారు. ఆసక్తిగల భక్తులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చునని చెప్పారు. వివరాలకు 9441774743 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదేశాలు ఉల్లంఘిస్తే కేసులు

బి.కొత్తకోట: మండలంలోని గట్టు గ్రామంలో కోర్టు వివాదంలోని ప్రభుత్వ భూమిలో ఎవరైనా ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ అజారుద్దీన్ హెచ్చరించారు. ఆదివారం వివాదాస్పద భూమిలో స్టే కలిగిన వ్యక్తి పోలంలో దున్నుతున్నట్టు వీడియో, ఫొటోలు వైరల్ అయ్యాయి. దీనిపై స్పందించిన తహసీల్దార్ చర్యల కోసం ఆర్ఐ వీరాంజనేయులను పంపగా ఆయన పరిశీలించి అక్కడనున్న వారిని పొలం నుంచి పంపేశారు. వివాదాలు సృష్టించడం, ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బి.కొత్తకోట: రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపడితే మేలైన దిగుబడులు పొందవచ్చని కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.స్వరాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని కోటావూరులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు అవగాహన కల్పించారు. తగిన మోతాదులోనే ఎరువులు వినియోగించాలని కోరారు.

ట్రైకోడ్మా విరిడి మొగు జీవ శిలింద్రనాశిని వాడటం వలన నేల ద్వారా పంటలకు సంక్రమించే తెగుళ్లను అరికట్టవచ్చని సూచించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ కే.మాధురి మాట్లాడుతూ కేవీకే లక్ష్యాలను వివరించారు. వరి, వేరుశనగ, కంది పంటల్లో నూతన వంగడాలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే ఫామ్ మేనేజర్ ఆశోక్‌కుమార్, ఏఓ చంద్రశేఖర్, వీఏఓ షంషీర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలు ఇష్టానుసారం.. ఆదాయం శూన్యం!

- నిబంధనలు కూడా పాటించని వైనం
- పట్టించుకోని మండల అధికారులు

గాలివీడు : గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రచార బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో విచ్చలవిడిగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఇటీవల కాలంలో వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలతో పాటు కొద్దిపాటి నుంచి భారీస్థాయిలో నిర్వహించే కార్యక్రమాలను ప్రజలకు తెలిసే విధంగా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. దీంతో నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక నిబంధనలకు ఏమాత్రం పాటించకుండా ఏర్పాటు చేస్తున్న భారీ సైజుల హోర్డింగ్ గాలి వీచినప్పుడు, భారీ వర్షం కురిసినప్పుడు కూలిపోతున్నాయి. అనుమతుల విషయంలో చదరపు అడుగుకు చొప్పున ధరల్ని నిర్ణయించి పంచాయతీ అధికారులకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అనుమతులు పొందిన వారు ఆర్థిక సంవత్సరం మొదలుకుని చివరి వరకు కొనసాగించవచ్చు. నిబంధనల విషయానికొస్తే హోర్డింగులు రోడ్డుపక్కన ఏర్పాటు చేసేటప్పుడు వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలగకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగినంత ఎత్తు, దూరంలో ఏర్పాటు చెయ్యాలి. అయితే నిబంధనలకు నీళ్లొదిలిన ప్రచారకర్తలు విచ్చలవిడిగా ప్రచార హోర్డింగులను ఏర్పాటు చెయ్యడం కొసమెరుపు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


రహదారులపై ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులు



అనుమతులు తప్పనిసరి

మండల పరిధిలో ప్రధాన రహదారి వెంబడి హోర్డింగులు, భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చెయ్యాలంటే గ్రామ పంచాయతీల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతులు తీసుకోనివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అంతేగాక అనుమతులతో పాటు హోర్డింగుల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

– జవహర్ బాబు, గాలివీడు ఎంపీడీఓ

నేటి సమ్మెను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

రాయచోటి టౌన్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఎన్నో ఏళ్లుగా కార్మిక వర్గం సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ 9వ తేదీ (నేడు) సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజనేయులు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహించి ఆయుధాలు అమ్ముతూ అమెరికా తన సామ్రాజ్యాన్ని విస్తరించడానికి దేశాల మీద విచ్చలవిడిగా సుంకాలు విధిస్తున్నారు. మన దేశాన్ని దోపిడీ చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మెప్పు కోసం మోడీ దేశంలో కార్మిక వర్గం మీద భారాలు వేస్తూ లేబర్ కోడ్లను వ్యవసాయ నల్లచట్టాలను అమలు చేస్తూ పర్మినెంట్ ఉద్యోగులను రద్దూ చేస్తూ ప్రభుత్వ సంస్థ ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. విశాఖ ఉక్కు లాంటి సంస్థలో కార్మికులను తొలిగించి ప్రైవేటీకరణ చేయాలని పూనుకుంటుంటే రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, వైఎస్సార్ సీపీలు నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేకుంటే సంపద సృష్టించడానికి పరిశ్రమలు, వ్యవసాయ ఆధారంగా ఆర్థిక సంపద పెంచాలన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల పని గంటలు పెంచి జీతం పెంచకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో లేబర్ కోడ్‌లు రద్దు చేస్తామనకుండా క్యాబినెట్ మీటింగ్‌లో 8 గంటల పని గంటలను 12 గంటలకు పెంచి మహిళలకు నైట్ డ్యూటీలు వేయడం అంటే కార్మికులను కట్టుబానిసలుగా మార్చడమేనని పేర్కొన్నారు. విజన్ 2047 బూటకమని విమర్శించారు. సమ్మెను విజయవంతం చేయాలని ఉద్యోగ, కార్మిక వర్గాలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ చంద్రశేఖర్, రవికుమార్, వెంకట్రామయ్య, మణి, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనములతో అధిక దిగిబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మహేష్‌బాబు

రాజంపేట రూరల్ : నాణ్యమైన విత్తనములు భూమిలో విత్తడం ద్వారా రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టి.మహేష్‌బాబు తెలియజేశారు. మండల పరిధిలోని మందపల్లి, తాళ్లపాక గ్రామాలలో ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేవీకే విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మహేష్‌బాబు, హైదరాబాద్ భారత నూనె గింజల సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సి.మణిమురుగన్ పాల్గొని రైతులకు ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు ఎలా సాధించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.రాజకుమారి, మందపల్లి, తాళ్లపాక గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.రాజేష్, పి.జయపాల్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో భక్తుల తాకిడి


లక్కిరెడ్డిపల్లె: అలంకారంలో అనంతపురం గంగమ్మ


సంబేపల్లె: పూజలుందుకుంటున్న నల్లగంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : రాయలసీమలోనే ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయ అధికారులు క్యూలైన్‌లో అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. మొక్కుల ఉన్న భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి గంగమ్మను దర్శించుకున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి రావడం చిన్నపాటి జాతర వాతావరణం కనిపించింది. అంతకుముందు ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నల్లగంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల కేంద్రంలో కొలువై భక్తుల విశేష పూజలందుకుంటూ కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరొందిన నల్లగంగమ్మకు భక్తులు దర్శించి పూజలు చేయించారు. ఆదివారం సందర్భంగా వేకువ జామునే ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ముందు భాగంలో బీజాక్షరాలతో ఉన్న మహిమగల రాయిపై వరపడ్డారు.

అమ్మవారి చీరల వేలంపాట


అమ్మవారి ఆలయంలో జరుగుతున్న చీరల వేలంపాట

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల పెద్దూరులో కొలువుదీరిన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారి చీరెలను వేలం వేశారు. ఇటీవల జరిగిన శ్రీ ఎల్లమ్మ జాతర సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన 112 చీరలకు వేలంపాట నిర్వహించారు. వంగిమళ్ల, దిగువరాచపల్లి గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలంలో పాల్గొని అమ్మవారి చీరలను దక్కించుకున్నారు. పోటాపోటీగా సాగిన ఈ వేలంపాటలో కల్లివాండ్లపల్లికు ఆదినారాయణ రెడ్డి ఒక చీరను రూ. 4500లకు దక్కించుకొని మొదటి స్థానంలో నిల్వగా, నాగిరెడ్డిపల్లికి చెందిన కల్లూరి శ్రీనివాసులు రెడ్డి ఒక చీరను రూ. 4100లకు దక్కించుకొని ద్వితీయ స్థానంలో నిలిచారు. దాదాపు 112 అమ్మవారి చీరలకు వేలంపాట నిర్వహించగా రూ. 1,47,300లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన 'కూటమి'

కలికిరి(వాల్మీకిపురం): అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయనను నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారినుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ నాలుగో తేదికి ఏడాది కావస్తోందని, ఇప్పటివరకూ సూపర్ సిక్స్ హామీలేవీ నెరవేర్చలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. కూటమి పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు రేషన్ బియ్యాన్ని ఇంటింటికి సరఫరా చేస్తున్న ఎండీయూ వాహనాలను రద్దు చేసిన ప్రభుత్వం వేలాది కుటుంబాల స్వయం ఉపాధిపై దెబ్బకొట్టి వారికి రోడ్డున పడేసిందన్నారు. ప్రభుత్వం అనాలోచితంగా అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రజల దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని ఓబులంవారిపల్లి గ్రామానికి చెందిన కె.పెద్దరెడ్డెప్ప రెడ్డి కుమార్తె అచిత నిశ్చితార్థ కార్యక్రమానికి ఆదివారం చింతల రామచంద్రారెడ్డి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.

టీడీపీ అధిష్టానంపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు

రాయచోటి : తెలుగుదేశం పార్టీలో తిరుగులేని నేతలుగా పనిచేసిన సుగవాసి కుటుంబానికి తగిన ప్రాధాన్యత లభించకపోవడం పట్ల ఆ పార్టీ నాయకులు, సుగవాసి అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. శనివారం జడ్పీ మాజీ చైర్మన్, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి సుబ్రమణ్యం పార్టీ పదవులకు రాజీనామా చేయడంతో రాయచోటి, రాజంపేట ప్రాంతాల్లోని సీనియర్ నాయకులు సుగవాసి కుటుంబ అభిమానులలో ఆందోళన, ఆవేశాలు సోషల్ మీడియా వేదికగా కట్టలు తెంచుకుంటున్నాయి. పార్టీలో 40 సంవత్సరాలపాటు సేవలు అందించి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిన కుటుంబానికి పార్టీ అధిష్టానం ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ మండిపడుతున్నారు. తెలంగాణలో టీడీపీ వీడిన నేత చనిపోతే ఆంధ్ర రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళ్లి నివాళులు అర్పించిన లోకేష్ బాబు ఒక పర్యాయం ఎంపీగా, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి చివరకు పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం శ్రమించిన పాలకొండ్రాయుడు మృతి పట్ల ఏమాత్రం సానుభూతి ప్రకటించకపోవడం దారుణమంటూ ఆరోపిస్తున్నారు. మహానాడు వేదిక సందర్భంగా రాయచోటి మీదుగా వెళ్లిన మంత్రి లోకేష్ సుగవాసి కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహానాడు జరిగిన పది రోజుల తేడాలో ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాలో టీడీపీకి భారీ షాక్ తగిలిందని అభిప్రాయపడ్డారు. పార్టీ పుట్టినప్పటి నుంచి టీడీపీలో ఉన్న సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించి టీడీపీకి షాక్ ఇచ్చారన్నారు. తన ఇంట్లో సైకిల్, తన ఇంటిమీద పసుపు జెండా, తన ఒంట్లో టీడీపీ మీద భక్తిని నిండుగా నింపుకున్న సుగవాసి లాంటి సీనియర్ నేత పార్టీకి రాజీనామా చేయడం అంటే బిగ్ షాక్ అంటున్నారు. కూటమి పాలనకు ఏడాది పూర్తి అవుతున్న నేపథ్యంలో బలమైన నేత పార్టీకి రాజీనామా చేయడం గ్రౌండ్ లెవల్‌లో మారుతున్న పరిణామాలకు సంకేతమా అన్న చర్చ సాగుతోంది.

నేడు రాయచోటికి వైఎస్ షర్మిల రాక

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి నేడు (సోమవారం) రెండు రోజుల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ తెలిపారు. ఆదివారం రాయచోటిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంతటా షర్మిల పర్యటించనున్నారని అందులో భాగంగా ముందుగా రాయచోటిలో అన్ని జిల్లా అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. ఆమె పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీ ఖాన్, ఉపాధ్యక్షులు చెన్నకృష్ణ, దర్బార్ బాషా, జనరల్ సెక్రటరీ అమీర్ బాషా, పట్టణ అధ్యక్షులు సర్దార్, నాగార్జున, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

సిద్దవటం : మండలం కేంద్రమైన సిద్దవటంలోని హైలెవల్ వంతెన వద్దనున్న పెన్నా నదిలో నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. హైలెవల్ వంతెనకు కూత వేటు దూరంలో ఇసుక తవ్వకాలు జరుగుతుంటే వంతెన దెబ్బతింటోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇలా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు గాని, పోలీసులు గాని పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికడతామని, ఉక్కుపాదం మోపుతామని పత్రికా సమావేశాల్లో అధికారులు గొప్పలు చెబుతున్నారనే తప్పా క్షేత్రస్థాయిలో ఆచరణలోకి రావడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.

08 ఆర్జేపీటీ 352 సిద్దవటం హైలెవల్ వంతెనకు కూతవేటు దూరంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం

సమాజాభివృద్ధికి పోరాటాలే దిక్సూచి

కడప వైఎస్ఆర్ సర్కిల్: సమాజాభివృద్ధికి పోరాటాలే దిక్సూచి అని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. నగరంలోని ఉపాధ్యాయభవన్‌లో సీపీఎం జిల్లా స్థాయి ×శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ సమాజంలో అన్యాయాలను ప్రశ్నించాలంటే సీపీఎం కార్యకర్తలు రాజకీయ, సామాజిక స్పృహను పెంచుకోవాలని పిలుపునిచ్చారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఐక్యంగా వీరోచిత పోరాటం నిర్వహించారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలంటే సీపీఎం కార్యకర్తలకు క్రమశిక్షణ ఉండాలని గుర్తు చేశారు.

సాహిత్య కార్యక్రమాల సారథి గానుగపెంట

కడప కల్చరల్: వైఎస్సార్ కడప జిల్లాలోని సాహిత్య కార్యక్రమాలకు సాహితీవేత్త గానుగపెంట హనుమంతరావు సారథిగా వ్యవహరించి తన ప్రత్యేకత చాటుతున్నారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గానుగపెంట హనుమంతరావును అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ హనుమంతరావు ఏర్పాటు చేసిన సాహిత్య సంస్థలు, పలు సాహిత్య పీఠాలు, సాహిత్య సంస్థల నిర్వహణతోపాటు ఆయన రచించిన పలు పుస్తకాల గురించి వివరించారు. పెన్నా నర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ మూడు రాష్ట్రాల గవర్నర్లతో జీవిత సాఫల్య పురస్కారాలను అందుకున్న ఘనత హనుమంతరావుకే దక్కిందన్నారు. పెన్ననర్ల సంఘం కోశాధికారి నూనె నగేష్, ఇతర ప్రతినిధులు తుపాకుల నారాయణ, సుబ్బరాయుడు, లింగమూర్తి, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు


పోటీల్లో బండను లాగుతున్న ఎడ్లు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీ అంకాలమ్మ తిరునాల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో నాలుగు జతల ఎడ్లు పాల్గొన్నాయి. మెదటి బహుమతి రూ. 50 వేలను, వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం రాజువారిపేటకు చెందిన లింగాల శ్రీకాంత్‌రెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి రూ. 30వేలను కడప రూకావారిపల్లె గ్రామానికి చెందిన బొజ్జ విద్యాఓబుల్‌రెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. మూడవ బహుమతి రూ. 20 వేలును వల్లూరు మండలం సీతోర్‌పల్లికి చెందిన చందా ప్రణీత్‌కుమార్‌రెడ్డి, బద్వేల్ మండలం కుమ్మరకొట్టాలకు చెందిన వినుకొండ రఫీ ఎడ్లు గెలుచుకున్నాయి. నాల్గవ బహుమతి రూ. 15 వేలును అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం వరదాయపల్లె కు చెందిన బెస్త శ్రీరాములు ఎడ్లు గెలుచుకున్నాయి. ఈ బహుమతులను ఆలయం వద్ద గ్రామపెద్దల సమక్షంలో విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో కుప్పాల వెంకటసుబ్బయ్య, అవ్వారు రవిశంకర్, గంజి సుబ్బరాయుడు, శ్రీకాంత్ మరికొందరు నాయకులు, గ్రామస్తులు మాజీ సర్పంచ్ గాలి ఓబులయ్య, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వేణుగోపాలుడు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేరళ వాయిద్యాలు


సింహ వాహన సేవ

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సింహ వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. పంచేటి వారు ఈ వాహన సేవను నిర్వహించారు. శనివారం రాత్రి నాయుడు సంఘం ఆధ్వర్యంలో శేష వాహన సేవ జరిపారు. భక్తుల కోసం హరికథ కాలక్షేపాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

నేడు హనుమద్ వాహన సేవ

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెడ్డిసంఘం వారిచే సోమవారం హనుమద్ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య,

గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. హరికథతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నాయుడు సంఘం వారు కేరళ వాయిద్యాలుచే కుటుంబ సభ్యులు స్వామివారికి ఉభయాలు తీసుకువెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

క్రీస్తు బోధనల ఆచరణతో విశ్వశాంతి


చర్చిలో ప్రార్థన చేస్తున్న నిసార్ అహ్మద్ తదితరులు

మదనపల్లె రూరల్ : ఏసుక్రీస్తు బోధనలు ఆచరించటం ద్వారా విశ్వశాంతి లభిస్తుందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. పట్టణంలోని పెంతెకోస్తు మిషన్ చర్చిలో, స్థానిక క్రైస్తవ సోదరుల ఆహ్వానం మేరకు..మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతితో కలిసి ఆదివారం ప్రార్థనల్లో నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమన్నారు. కుల, మత, వర్ణ విభేదం లేకుండా సేవాభావంతో మెలగడమే క్రైస్తవమన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని ఆయన ఎంచుకున్న మార్గం అందరికీ దిక్సూచిగా నిలుస్తోందన్నారు. ఇతరులపై ప్రేమ, సహనం, శాంతి, సేవాభావం వంటి గొప్ప గుణాలను ఆచరించాలని శాంతిదూత ఇచ్చిన సందేశం మనందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. క్రిస్టియన్‌ల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, కో ఆప్షన్ శారదారెడ్డి, నాయకులు మునిశేఖర్, రాజేష్, రిచీ, మయూర్, ప్రభాకర్, శ్రీనివాసులు, శ్యామ్, శంకర్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, వి.యాదవ్, చరణ్, చిన్న, భానుప్రకాష్, జహీర్, నాగమణి పాల్గొన్నారు.

యోగాతో ఆనంద జీవితం


యోగా చేస్తున్న వృద్ధులు

మదనపల్లె సిటీ: యోగాతో ఆనంద జీవితం గడపవచ్చునని యోగా మాస్టర్ డాక్టర్ అనితలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో యోగా మాసోత్సవాలను పురస్కరించుకుని యోగా సమావేశం నిర్వహించారు. యోగతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లల నుంచి పెద్దల వరకు యోగాను ఆచరించవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, బొమ్మచెరువు మెడికల్ ఆఫీసర్ జె.దివ్య, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో పాల్గొనండి

కలకడ : మండల స్థాయిలో చేపట్టే యోగాంధ్ర కార్యక్రమంలో మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం కోరారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు కె.బాటవారిపల్లె ప్రభుత్వ పాఠశాల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించి కలకడ మూడురోడ్లు కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.